క్లుప్తంగా

రాగితీగ చోరీ



దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కందుకూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి దుండగులు రాగి తీగను ఎత్తుకెళ్లారు. మండలంలోని నేదునూరుకు చెందిన రైతు కొంతం చెన్నారెడ్డి వ్యవసాయ పొలంలో అధికారులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి అందులోని రాగి తీగలను దొంగిలించారు. ఆదివారం ఉదయం రైతు చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కిషన్‌రెడ్డికి అభినందనలు



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైనా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు అభినందించారు. నియోజకవర్గం బడంగ్‌పేట్‌లో జన్ సంపర్క్ అభియాన్ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసిన అందెలను కిషన్‌రెడ్డి అభినందించారు. అనంతరం కిషన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన ధీరాజ్‌రెడ్డిని అందెల సన్మానించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడ అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్‌కు నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, బండి స్వామి, గంట శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ముత్యాల అమరేందర్, దర్శన్, సురేందర్, అనీల్, రాజు, రమేష్, బాలకృష్ణ, కిరణ్ తదితరులు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీలో లక్ష్మీ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోకాళ్లు, నడుము నొప్పులు, పక్షవాతం,ఆస్తమా, చర్మవ్యాధులు, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ వై.శ్రీనివాసులు, డాక్టర్లు నిఖిత, నవీన్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు సిరిగిరి రాంరెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వీధి దీపాల మరమ్మతు

వనస్థలిపురం: జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ ఆధ్వర్యంలో జోన్‌లోని వివిధ కాలనీల్లో శుక్ర, శనివారాల్లో ఎలక్ట్రికల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వెలగని 1600 స్ట్రీట్ లైట్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో స్ట్రీట్‌లైట్లపై వచ్చిన 180 ఫిర్యాదులను పరిష్కరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఈఈ బి.పున్నానాయక్, డీఈలు రవీంద్ర, శ్రీనివాస్, ఏఈలు ప్రత్యూష, ప్రసాద్, జగన్నాథం పాల్గొన్నారు.

'సూరజ్‌నగర్' నూతన కమిటీ ఎన్నిక

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని సూరజ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చల్లా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు చెక్క ధన్‌రాజ్, యాట శంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి వీఆర్‌బి.రెడ్డి, డి.పర్వతాలు, మల్లేష్ యాదవ్, కోశాధికారి రమేష్ గుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శి వలిగె వెంకటేష్, రమావత్ లక్ష్మీ నాయక్, ఆడిట్ సభ్యులుగా కె.రామానుజ బాబు, వెంకటేశ్వర్, గౌరవ సలహాదారులు సురేందర్ రెడ్డి, యాదయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులుగా బాలు, రాజు, విజయ్‌కుమార్, శంకర్‌రావు, గౌరవ ముఖ్య సలహాదారులుగా వెంకటేష్, రఘుమారెడ్డి, సుదర్శన్ రెడ్డి, తిరుపతయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు.

భక్తుల కల నెరవేరుతున్న వేళ

- ఊపందుకున్న దర్గా ర్యాంప్ నిర్మాణ పనులు
- రెండో దశలో రూ.4.65 కోట్లు మంజూరు
- మొత్తం రూ.14.25 కోట్లతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



కొండపైకి నిర్మిస్తున్న ర్యాంప్

పహాడీషరీఫ్: చారిత్రక నేపథ్యం కలిగిన పహాడీషరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ దర్గా ర్యాంప్ నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. రూ.9.60 కోట్ల నిధులతో రెండేళ్ల క్రితమే పనులు ప్రారంభమైనప్పటికీ.. అప్పట్లో వేసిన అంచనా వ్యయం ప్రస్తుతం పెరిగిన నిర్మాణ వ్యయానికి సరిపడక సదరు కాంట్రాక్ట్ సంస్థ పనులను పెండింగ్‌లో ఉంచింది. అయితే తాజాగా మరో రూ.4.65 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరితగతిన పనులు పూర్తి చేసి భక్తులకు ర్యాంప్‌ను అందుబాటులోకి తేవాలని మంత్రి సబితారెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ర్యాంప్ పనులను జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

సులభతరం చేసేందుకే

757 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దర్గాను దర్శించుకోవడానికి మెట్ల మార్గం ద్వారా భక్తులు వెళ్లేవారు. చిన్నారులు, వృద్ధులు ఈ కొండపైకి ఎక్కాలంటే కష్టతరంగా ఉండేది. దర్గాపైకి ర్యాంప్ ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే 2021లో రూ.9.60 కోట్లు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారి నుంచి కొండపైకి 700 మీటర్ల పొడవులో, 16 మీటర్ల ఎత్తు, 32 ఫీట్ల వెడల్పులో ఈ ర్యాంప్ నిర్మాణం కొనసాగుతుంది. అదనపు నిధులతో కొండపై విశ్రాంతి గదులు, పార్కింగ్, లైటింగ్, ఆర్చ్ పనులను చేయనున్నారు.

నిజాం కాలికి గాయం కావడంతో..

సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఉన్న దర్గాకు సరైన మార్గం లేదు. దర్గా పైకి ఎక్కే సమయంలో నిజాం బాద్‌షా కాలికి గాయమైంది. దీంతో రాజునైన తనకే గాయాలైతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని భావించిన నిజాం మహబూబ్ అలీ బాద్‌షా ఈ దర్గాకు 360 మెట్లు నిర్మించారు. నిజాం కాలంలో నిర్మించిన మెట్లు నేటికి చెక్కు చెదరకుండా ఉండటం మరో విశేషం.

భక్తులకు సౌకర్యంగా..



పహాడీషరీఫ్ దర్గాపైకి ర్యాంప్ నిర్మాణ పనులు పెండింగ్‌లో పడడంతో మంత్రి సబితారెడ్డి చొరవతో రెండో విడుతలో రూ.4.65 కోట్లు మంజూరు చేయించడం సంతోషకరం. ఉర్సు ఉత్సవాలతో పాటు సాధారణ సమయంలో దర్గాకు వస్తున్న భక్తులలో చాలా మంది మెట్ల ఎక్కలేక కింది నుంచే వెళ్లిపోవాల్సి వస్తోంది. ఈ ర్యాంప్ నిర్మాణం పూర్తయితే దర్గాకు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. బాబాను దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయి.

– సయ్యద్ యూసుఫ్ పటేల్, షాహీన్‌నగర్

ఆత్మీయ సమ్మేళనంలో మేయర్



రఘు హోమ్స్ కాలనీవాసులతో మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ రఘుహోమ్స్ కాలనీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో..

ఆదివారం 10వ డివిజన్‌లోని ఇందిరానగర్ కాలనీలో బడంగ్‌పేట నగర పంచాయితీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి పర్యటించారు. ఇందిరానగర్ కాలనీతో పాటు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయంలో నీటి సమస్యతో పాటు చాలా సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

వైస్ ఎంపీపీ అనంతరెడ్డి

ఆమనగల్లు: ప్రజలందరి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి అన్నారు. మండలంలోని మంగళపల్లిలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రామంలో మండల పరిషత్, జిల్లా పరిషత్, ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. త్వరలో మండల మహిళా సమాఖ్య భవనం పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. మంగళపల్లి నుంచి చెన్నారం రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అంగీకరించారని త్వరలో నిధులు మంజూరవుతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ ఉపసర్పంచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు

- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు
- మహంకాళి ఆలయంలో మంత్రి సబిత పూజలు



మహేశ్వరంలో శివలింగానికి పూజలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: అమ్మా బైలెల్లి నాదో తల్లీ బైలెల్లి నాదో అంటూ గ్రామాల్లో ఆషాఢమాస బోనాల సందడి నెలకొంది. పోతరాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలతో మహంకాళి అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనతో పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మంత్రి సబితారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలు చల్లంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. పూజలో మహేశ్వరం సర్పంచ్ ప్రియాంక, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, నాయకులు చంద్రయ్య, ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

మండలంలోని అమీర్‌పేట్‌లో ఆదివారం మహంకాళి, పోచమ్మ అమ్మవారికి బోనాల సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు అలరించారు. ఉత్సవాల్లో గ్రామ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ నర్సింగ్, ఎంపీటీసీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

గొల్లూరులో..

మండలంలోని గొల్లూరులో మైసమ్మ, పోచమ్మ అమ్మవారి బోనాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన నిర్వహించారు. వేడుకల్లో సర్పంచ్ ఎం కవిత, మాజీ సర్పంచ్ ఎం కవిత, ఎల్లని హరినాద్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరిగిరిపురంలో..

సిరిగిరిపురంలో అమ్మవారి బోనాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ లక్ష్మీ, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొమురయ్య, నర్సింహ, పోచయ్య, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు

తుక్కుగూడ: తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ, తదితర గ్రామాల్లో ఆదివారం వైభవంగా మహంకాళి బోనల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి, పూజలు చేశారు. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యమును డప్పు చప్పులు, శివసత్తులు, పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపు ద్వారా ఆలయానికి తీసుకువచ్చారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల పూజారులు, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

బోనమెత్తిన శ్రీరాం కాలనీ

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. శివ సత్తులు చిందులు, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు మహిళలు బోనాలు సమర్పించారు. ముత్యాలమ్మ ఆలయం, పోచమ్మ ఆలయాల వద్ద మేకలు, కోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా బోనాలు

కందుకూరు: మండలంలోని దెబ్బడగూడ, తిమ్మాపూర్ గ్రామాల్లో మహంకాళి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దెబ్బడగూడలో బోనాల ఉత్సవాలకు బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కడారి జంగయ్యయాదవ్, కొంతం జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని, అమ్మవారికి పూజలు చేశారు.



పహాడీషరీఫ్: సాకలు సమర్పిస్తున్న మహిళా భక్తులు



కందుకూరు: దెబ్బడగూడలో బోనాల ఉత్సవాల్లో అందెల శ్రీరాములు

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజారోగ్యమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్కులను హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఆమనగల్లు ఎంపీపీ అనిత విజయ్, నాయకులు సంజుయాదవ్, సురేందర్ రెడ్డి, బాబా, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, పోలెపల్లి సర్పంచ్ బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన సరోజకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.16,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరయ్యింది. ఆదివారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, రామస్వామి, శ్రీకాంత్, దస్తగిరి, లక్ష్మీనారాయణగౌడ్, వెంకటయ్య, శంరయ్య, రాఘవాచారి, పరంధాములు, మల్లేష్, సత్యం పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు

ఆమనగల్లు: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్లు చెక్కల లక్ష్మణ్, చెన్నకేశవులు సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను, అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్, టిల్లుయాదవ్ మల్లేశ్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలను విస్తృతం చేయాలి

- ఎన్‌ఆర్‌ఐ సందీప్‌రెడ్డి
- తాళ్లపల్లిగూడలో వీఆర్‌వన్ ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సందీప్‌రెడ్డి, సభ్యులు

మంచాల: మంచాల మండలంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించాలని ఎన్‌ఆర్‌ఐ కుకుడాల సందీప్‌రెడ్డి (అమెరికా) అన్నారు. మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడ గ్రామంలో ఆదివారం వీఆర్‌వన్ ఫౌండేషన్ సంస్థ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించింది. నూతన కమిటీ ఎన్నిక కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రెండు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ప్రజలకు చేసిన సేవలకు సంబంధించిన ప్రత్యేక బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు వీఆర్‌వన్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని అన్నారు. గ్రామాల్లో పేద ప్రజలకు విద్య, వైద్యం వంటి అంశాల్లో తమవంతు సహకారం అందించడమే గాకుండా నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఆర్థికసహాయం అందించడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులకు, వికలాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు 13 వాటర్ ఫిల్టర్ల ఏర్పాటు వంటివి చేశామన్నారు. వికలాంగులకు, అంధులకు చేతి కర్రలు, చెవిటి వారికి యంత్రాలు అందించారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి సహాయం అందించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు భాగవతాలు, వీధి నాటకాలు కూడా నిర్వహించారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడదామని పిలుపునిచ్చారు. వీఆర్‌వన్ ఫౌండేషన్ నూతన కమిటీ చైర్మన్‌గా మరోసారి కుకుడాల అజితరెడ్డిని ఎన్నుకున్నారు. ఆ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భిక్షపతి, సభ్యులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ

డాక్టర్ దాసరి అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్ యాదవ్

వనస్థలిపురం: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా పార్టీ 119 అసెంబ్లీ స్థానాలలో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ యశోదనగర్ కాలనీలోని ప్రజా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పార్టీ బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తుందని, అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేస్తున్నాయని, ఆ పార్టీలకు బీసీని ముఖ్యమంత్రి చేసే దమ్ము ఉందా అని అజయ్‌కుమార్ ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్, నాయకులు భాగ్యలక్ష్మి, సతీష్‌యాదవ్, మహేష్‌యాదవ్, ఈశ్వర్, రాములు, ప్రశాంత్, నాగప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'కళలను ప్రోత్సహిద్దాం'

తలకొండపల్లి: కనుమరుగవుతున్న కళలను ఆదరించాలని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. మండల పరిధిలోని చంద్రధనలో హనుమాన్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి వీధి నాటకాన్ని కళాకారులు నిర్వహించారు. 4 రోజులుగా ప్రదర్శించిన వీధి నాటకం శనివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ఆదివారం సర్పంచ్ వ్యక్తిగతంగా కళాకారులకు రూ.11,116 ఆర్థిక సహాయం అందజేశారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణి, రాజుయాదవ్, వెంకటేశ్, కృష్ణవేణి, రేణుక, యాదయ్య, దామోదర్, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, నరసింహగౌడ్, నరేష్, శివ, శివానంద, రమేష్, శేఖర్, శ్రీను, తిరుపతయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లికి మండల హోదా ఇవ్వండి

మంత్రి హరీశ్‌రావుకు గ్రామస్తుల వినతి

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆ గ్రామ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి హరీశ్‌రావును సిద్దిపేట్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి చెప్పినట్లు నాయకులు తెలిపారు. జేఏసీ నాయకులు సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, శరత్‌చంద్ర శర్మ, రేణురెడ్డి, జంగయ్య, రాజేందర్, శ్రీధర్, మచ్చేందర్, కృష్ణ, డేవిడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హామీని నిలుపుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ పాలనలో మౌలిక వసతులు కరువు

సామ రంగారెడ్డి



శ్రీనివాసపురంలో పాదయాత్ర నిర్వహిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లైనప్పటికీ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఇంకా కాలనీలలో మౌలిక సదుపాయాలు ఏర్పడలేదని, కాలనీలలో ముంపు, డ్రైనేజీ తదితర సమస్యలు అలాగే ఉన్నాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం, శ్రీ శ్రీనివాసపురం, క్రిస్టియన్ కాలనీ, నాగార్జున కాలనీలలో పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను కాలనీవాసులకు వివరించారు. అలాగే బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వారి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రవిందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, టి.విజయ్‌కుమార్, అంజన్‌కుమార్, చిన్నాయాదవ్, రేవతి, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్, ప్రశాంత్‌రెడ్డి, వీరస్వామిగౌడ్, భార్గవ్‌తేజ, రోజారమణి, జి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు వేస్తాం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రతి పల్లె, ప్రతి తండాకు బీటీరోడ్లు నిర్మించడమే లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మాడ్గుల మండలంలోని పడమటితండా, చెట్లగుట్టతండా, కుబ్యాతండా, మక్తతండా, జర్పులతండాకు సంబంధించి బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి ఎమ్మెల్యే జైపల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలు, తండాలకు బీటీరోడ్డు నిర్మిస్తామన్నారు. ఆమనగల్లుకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరైందని, త్వరలో మరిన్ని డివిజన్ కార్యాలయాలు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రవితేజ, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సర్పంచ్‌లు హన్మానాయక్, యాదిరెడ్డి, పుష్పలత, జంగయ్య, శ్రీనివాస్, ఎంపీటీసీ భారతి, గోపి తదితరులు పాల్గొన్నారు.